ఆ దీవులకు వరం సచివాలయం


సుందరంగా నిర్మించిన జీవీపాళెం సచివాలయం

- తెలుగు తెలియని ఇరకం, వేనాడుదీవుల వాసులు
- తమిళులకు వలంటీర్ల సేవలు
- అన్ని వర్గాల ప్రజలకూ అనుకూలం

తడ: మండలంలో 18 పంచాయతీలు ఉండగా అందులో దూరంగా విసిరేసినట్టు రెండు దీవులు ఉన్నాయి. మరి కొన్ని పంచాయతీలు మండల కేంద్రానికి సుదూరంలో ఉన్నాయి. భిన్నమైన భౌగోళిక పరిస్థితులతోపాటు తమిళనాడు సరిహద్దు మండలం కావడంతో తమిళ భాష తప్ప తెలుగు రాని ప్రజలకు సచివాలయం వరంలా మారింది. వలంటీర్ల సేవలు ఎంతో కీలకమయ్యాయి. దీంతో అన్ని రకాల ప్రజలకు సచివాలయ వ్యవస్థ ఎంతో సౌకర్యంగా మారింది.

గతం ఎంతో నరకం

గతంలో మండలంలోని దీవులకు చెందిన ఇరకం, వేనాడు గ్రామాల ప్రజలతోపాటు మండల కేంద్రానికి దూరంగా ఉన్న రామాపురం, పెరియవట్టు, కారాజాత, వాటంబేడు, మాంబట్టు, వెండ్లూరుపాడు, కాదలూరు పంచాయతీల ప్రజలకు ప్రభుత్వ సేవలు అందేవి కావు. కార్యాలయాల్లో పని చేసుకోవాలంటే నరకం చూసే వారు. పడవ ప్రయాణం తప్ప మరో మార్గం లేని ఇరకం ప్రజలు, సమయానుకూలంగా నడిచే పడవల ద్వారా ప్రయాణించి, పని చేసుకోలేకుండా ఉత్త చేతులతో తిరిగివెళ్లిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. వేనాడుకు రోడ్డు మార్గం ఉన్నా గ్రామం నుంచి 14 కిలో మీటర్లు మట్టి రోడ్డు మీదుగా ప్రయాణించి అక్కడి నుంచి 17 కిలో మీటర్లు సూళ్లూరుపేటకు, అక్కడి నుంచి 13 కిలో మీటర్లు తడకు ప్రయాణించి తహసీల్దార్, ఎంపీడీఓ, వెలుగు, ఎస్‌ఆర్‌ఈజీఎస్ తదితర ప్రభుత్వ కార్యాలయాలకు చేరుకోవాలి. అక్కడికి వెళ్లిన సమయంలో అధికారులు అందుబాటులో ఉండరు. ఒక వేళ అధికారులు ఉన్నా ఎన్నో నిబంధనలు, అవి చెప్పినా సరిగా అర్థం కావు. దీంతో మళ్లీ ఇంటికి తిరుగు ప్రయాణం. ఇలా ప్రభుత్వ సేవల కోసం పనులు మానుకుని నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. దీనికి తోడు ఆ పని కోసం లంచాలు, సిఫార్సులు ఉండేవి. ఇలాంటి వ్యయ ప్రయాసలు భరించలేక చాలా మంది అసలు ప్రభుత్వ కార్యాలయాలకు రావడమే మానుకున్నారు.

భాష సమస్య

మండలంలో ఎక్కువ మందికి తమిళం తప్ప మరో భాష తెలియదు. తెలుగు అర్థం అవుతుంది కానీ మాట్లాడడం, చదవడం, రాయడం రాని వారు ఎందరో. ఈ క్రమంలో ఏదైనా ప్రభుత్వ పని మీద తడ కార్యాలయాలకు వచ్చిన వారు అధికారులకు తమ సమస్యను సరైన రీతిలో వివరించలేక, దరఖాస్తు రాయలేక ఇబ్బంది పడుతూ దళారులను ఆశ్రయించే వారు. మరెందరో తెలుగు తెలిసిన నిరక్షరాస్యులు కూడా ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కొనే వారు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన వెంటనే సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రతి 50 కుటుంబాలకు ఒక వలంటీర్‌ను నియమించారు.

హాయిగా ఇంట్లో కూర్చుని..

సచివాలయ వ్యవస్థ పని చేయడం ప్రారంభించిన తరువాత వీరికి ప్రభుత్వ సేవలు ముంగిటకు చేరాయి. అసలు ప్రభుత్వ సేవలు ఇంత సులభంగా అందుతాయా అని ఆశ్చర్యపోతున్నారు. అసలు మండల కేంద్రానికి వెళ్లాల్సిన పని లేకుండా పోయింది. వలంటీర్లు ఇంటింటికీ తిరిగి వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కార మార్గం చూపుతున్నారు. దీంతో ప్రజల ఇబ్బందులు పూర్తిగా తొలగి పోయాయి. అవసరమైన పత్రాలు పొందేందుకు ప్రభుత్వమే శిబిరాలు నిర్వహించి మరీ అందజేస్తోంది. ఇక దళారులు, నాయకుల సిఫార్సులు, లంచాలు, భాష వంటి సమస్యలన్నింటికీ ఏకైక పరిష్కారం లభించింది. సచివాలయ వ్యవస్థ ఈ గ్రామాలకు ఒక వరంలా మారింది.

మా వలంటీర్ కన్న బిడ్డలా..



నా భర్త చని పోయాడు. నా ముగ్గురు కూతుళ్లకీ పెళ్లిళ్లు అయిపోయి అత్తారిళ్లకు వెళ్లి పోయారు. నేను ఒంటరిగా మిగిలాను. నాకు రేషన్‌కార్డులో సమస్య వచ్చినా, నాకు పింఛను రాసుకునేందుకు తెలియక పోయినా మా వలంటీరు అనిల్ కన్న బిడ్డలా అన్ని పనులు చేసిపెడుతున్నాడు. ఒకటో తేదీకల్లా పింఛను ఇంటికే తెచ్చిస్తున్నాడు. గతంలో ఏదైనా పని చేసుకోవాలంటే పనులన్నీ మానుకుని, ఊర్లో వారెవరైనా తడకు వెళుతుంటే వాళ్లను బతిమాలుకుని పనులు చేసుకోవాల్సి వచ్చేది. జగనన్న చలవతో ఇప్పుడు ఏదైనా వలంటీర్ సాయంతో సచివాలయానికి వెళ్లితే పని అయిపోతోంది. అసలు రూపాయి ఖర్చు లేకుండా నడుచుకుంటూ ఇంటికి వచ్చేస్తున్నాం.

– కోట్లపాటి రత్నమ్మ, అలాపత్రి గిరిజన కాలనీ, వేనాడు

క్లుప్తంగా

రాపూరమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో రాపూరమ్మ తల్లి

రాపూరు: రాపూరు గ్రామదేవత రాపూరమ్మకు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకం, కుంకుమార్చన, అనంతరం ప్రత్యేకంగా పుష్పాలంకరణ చేశారు. భక్తులు అమ్మవారికి అంబలి, పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. పెద్దఎత్తున భక్తులు రావడంతో ఆలయం కోలాహలంగా మారింది.

ఈ–క్రాప్ నమోదు తప్పనిసరి

సైదాపురం: ఖరీఫ్ సీజన్ పంటల వివరాలను ఈ–క్రాప్ కింద నమోదు చేయాలని మండల వ్యవసాయాధికారి హైమావతి కోరారు. శుక్రవారం ఆమె మండలంలోని చాగణం రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంటల వివరాలను ఈ–క్రాప్ నమోదు చేయడం ద్వారా రైతులకు పలు ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ సాధించుకుందాం

పెళ్లకూరు: ఎస్సీ వర్గీకరణను సాధించుకోవడానికి మాదిగలంతా సమాయత్తం కావాలని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి గోవిందువాసు పిలుపునిచ్చారు. మండలంలోని కానూరు, తాళ్వాయిపాడులో శుక్రవారం ఆయన పాద యాత్ర చేశారు. ఈనెల మూడో వారంలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న మాదిగ విశ్వరూప మహాసభకు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ నాయకులు పెంచలయ్య, రవి, మనోహర్, పోలయ్య, రమణయ్య, చంద్రయ్య, వెంకటకృష్ణయ్య పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు



గూడూరురూరల్ : రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా రెండో పట్టణ పరిధిలోని వెంకటగిరి క్రాస్ రోడ్డు, విందూరు వెళ్లే మార్గాల్లో 4 చోట్ల ఫ్లడ్ లైట్లను ఏర్పాటు చేసినట్లు సీఐ వెంకటేశ్వరరావు తెలిపారు. ఫ్లడ్ లైట్లను శుక్రవారం సాయంత్రం ఆయన ప్రారంభించారు.

ఏజెంట్లను నియమించుకోవాలి

గూడూరురూరల్ : ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి ఈనెల 21వ తేదీ వరకు జరగనున్న డోర్ టు డోర్ సర్వేలో బీఎల్ఓలతో కలిసి వివిధ రాజకీయ పార్టీలకు చెందిన బూత్ లెవల్ ఏజెంట్లు పాల్గొనాలని ఆర్డీఓ ఎం.కిరణ్‌కుమార్ కోరారు. శుక్రవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీఓ కిరణ్‌కుమార్ అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. బోగస్ ఓట్ల ఏరివేత, మృతి చెందిన వారి ఓట్లను తొలగించాలన్నారు.

చలపతి సేవలు ఎనలేనివి


హెచ్‌ఎం చలపతిని సన్మానిస్తున్న ప్రభాకర్‌రెడ్డి

సైదాపురం: విద్యాభివృద్ధికి మర్లపూడి హెచ్‌ఎం చలపతి అందించిన సేవలు ఎనలేనివని వైఎస్సార్‌సీపీ నేత ప్రభాకర్‌రెడ్డి కొనియాడారు. మండలంలోని మర్లపూడి ఉన్నత పాఠశాలలో శుక్రవారం పూర్వ విద్యార్థులు హెచ్‌ఎం చలపతికి వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దుశ్శాలువలతో ఘనంగా సత్కరించారు.

ఓటరు నమోదులో నిర్లక్ష్యం వద్దు

నాయుడుపేటటౌన్ : బీఎల్ఓలు ఓటరు నమోదు ప్రక్రియలో నిర్లక్ష్యానికి తావివ్వకూడదని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు సూచించారు. ఓటరు వెరిఫికేషన్ ప్రక్రియను శుక్రవారం పలు ప్రాంతాలకు వెళ్లి కమిషనర్ పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే కాకుండా, మారిన చిరునామాలు, కుటుంబ సభ్యులందరూ ఒకే చోట ఉండేలా చర్యలు చేపట్టాలని బీఎల్ఓలకు సూచించారు. ఓటరు జాబితా పక్కాగా తయారు కావాలని సూచించారు.

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి


అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

వెంకటగిరిరూరల్: వరిపంటలో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించి తక్కువఖర్చుతో నాణ్యమైన పంటను దిగుబడి సాధించవచ్చని డీఆర్‌సీ డీడీ రత్నప్రసాద్ తెలిపారు. మండలంలోని పాపమాంబపురం పొలాల్లో శుక్రవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. సమగ్ర వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. వరిసాగుపై రైతులకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీఏ నాగార్జునసాగర్, డీఆర్‌సీ ఏఏ వేణుగోపాలరెడ్డి, ఏఓ సుజాత, ఆర్‌బీకే సిబ్బంది రేఖ, విస్తరణ అధికారి రామ్మోహన్, గోపి, రైతులు పాల్గొన్నారు.

150 ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్కు


పార్కు ఏర్పాటుకు అధికారులు, నాయకులతో కలిసి స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

- బైపాస్ ఏర్పాటుకు రూ.16 కోట్లతో ప్రతిపాదనలు
- ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

గూడూరు రూరల్ : గూడూరు రెండో పట్టణ పరిధిలోని ఆటో నగర్, దివిపాళెం ప్రాంతాలకు సమీపంలో 150 ఎకరాల్లో నూతనంగా ఏర్పాటు చేయనున్న ఎంఎస్ఎంఈ ఇండస్ట్రియల్ పార్కుకు సంబంధించి శుక్రవారం పరిశ్రమశాఖ ఏడీ, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గూడూరు ప్రాంతంలో ఏర్పాటు కానున్న ఆటోనగర్‌కు అనుసంధానంగా ఎంఎస్ఎంఈ పార్కును ఏర్పాటు చేయాలని గతంలో ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి గౌతంరెడ్డిని కోరామని తెలిపారు. ఆయన అకాల మరణంతో ఆ పార్కు మంజూరులో జాప్యం జరిగిందన్నారు. ఇటీవల విజయవాడకు వెళ్లినప్పుడు పరిశ్రమశాఖ కార్యదర్శి, ఏపీఐఐసీ ఎండీని కలిసి పార్కు విషయం విన్నవించామని పేర్కొన్నారు. ఈమేరకు పరిశ్రమలశాఖ ఏడీ శ్రీనివాసరావు, అధికారులతో కలసి స్థలాన్ని పరిశీలించామన్నారు. ఇందుకు అవసరమైన 150 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, ఈమేరకు అధికారులు సర్వే నిర్వహించి నివేదికను ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. చెన్నై– బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌తోపాటు గూడూరు ప్రాంతంలో ఆటోనగర్, ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటైతే ఈ ప్రాంతం మరింతగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఆటోనగర్, ఎంఎస్ఎంఈ పార్కు, జగనన్న లేఔట్, టిడ్కో వసతి సముదాలను కలుపుతూ రోడ్డు కనెక్టివిటీ కోసం చిల్లకూరు మండలంలోని వరగ్రాస రోడ్డు నుంచి ఆటోనగర్ వరకు బైపాస్ ఏర్పాటుకు రూ.16 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. మరో రూ.16 కోట్లు భూములు కోల్పోయే రైతులకు పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, కోడూరు మీరారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి నాశిన నాగులు, పట్టణ అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాసులు, సుబ్బానాయుడు, జేసీఎస్ కన్వీనర్ శ్రీహరి, ఏఎంసీ వైస్ చైర్మన్ కొట్టు గోవర్ధన్, ఆటో నగర్ యూనియన్ ప్రెసిడెంట్ బాషా తదితరులు పాల్గొన్నారు.


ఆస్పత్రి భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

ప్రజారోగ్యానికి పెద్దపీట

చిల్లకూరు : ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు తెలిపారు. శుక్రవారం చిల్లకూరులో రూ 1.50 కోట్లతో నిర్మించిన పీహెచ్‌సీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. జిల్లా వైద్యశాఖాధికారి శ్రీహరి, ఏఎంసీ చైర్‌పర్సన్ ఓడూరు యమునమ్మ, జెడ్పీటీసీ మన్నెం శీనయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు బొమ్మిడి శ్రీనివాసులు, తాళ్లూరు శ్రీనివాసులు, కొట్టు అశోక్, అనుదీప్, అజీజ్, వైద్యాధికారులు భావనారాయణ, అరాఫత్ పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు


వెంకటగిరిలో పథకాల లబ్ధిని వివరిస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి

కలువాయి: రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ఫలాలను అందజేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి అన్నారు. మండల కేంద్రం కలువాయి–3 సచివాలయం పరిధిలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను అందజేసి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దళారులు, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా, పార్టీలతో సంబంధం లేకుండా సంక్షేమ పథకాలను ఈప్రభుత్వం నేరుగా ప్రజలకు అందజేస్తుందన్నారు. తాము గడప గడపకు తిరుగుతుంటే ప్రతి ఇంటా ప్రభుత్వ సంక్షేమ వెలుగులు కనిపిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు అనిల్‌కుమార్ రెడ్డి, ఎంపీపీ లక్ష్మీదేవి, ఉపాధ్యక్షుడు పెంచలనరసారెడ్డి, సర్పంచ్ పెంచలమ్మ, పార్టీ కన్వీనర్ ఎంపీ కృష్ణారెడ్డి, నాయకులు మేకపాటి వెంకటనరసారెడ్డి, మాదాసు యజ్ఞ పవన్, అధికారులు పాల్గొన్నారు.

నవరత్నాలతో ఇంటింటా సంక్షేమ కాంతులు

వెంకటగిరి: నవరత్నాల పథకాలతో ఇంటింటా సంక్షేమ కాంతులు విరాజిల్లుతున్నాయని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని 17వ వార్డు పరిధిలోని కలివేలమ్మవీధిలో శుక్రవారం కౌన్సిలర్, మున్సిపల్ విప్ పూజారిలక్ష్మి ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియతో కలిసి ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి పథకాలను వివరిస్తూ సంక్షేమ బావుటా బుక్‌లెట్లను అందజేశారు. సమస్యలపై అందిన వినతులపై పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మున్సిపల్ వైస్ చైర్మన్‌లు ఉమామహేశ్వరి, బాలయ్య, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ జి.ఢిల్లీబాబు, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు రాధమ్మ, కౌన్సిలర్‌లు వహీదా, ఏ.శ్రీనివాసులురెడ్డి, కల్యాణి, వైఎస్సార్‌సీపీ జిల్లా సహాయ కార్యదర్శి హరికృష్ణ, నేతలు పూజారి శ్రీను, విజనార్దన్, జలగం కామాక్షి, మాజీ ఎంపీపీ కె బ్రహ్మయ్య పాల్గొన్నారు.


కలువాయిలో బుక్‌లెట్ అందజేస్తున్న రామ్‌కుమార్ రెడ్డి

ఉపాధ్యాయురాలికి పరామర్శ

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు ధనియాల రాధమ్మ సోదరి, ఉపాధ్యాయురాలు జయలలిత అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆమెను శుక్రవారం నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పరామర్శించారు.

ఎంపీటీసీ సభ్యుడికి పరామర్శ

కోట : కోట ఎంపీటీసీ సభ్యుడు, జేసీఎస్ మండల కన్వీనర్ మొబిన్‌బాషాను శుక్రవారం గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు పరామర్శించారు. మొబిన్ బాషా ఇటీవల కుటుంబ సభ్యులతో కలసి కారులో చెన్నైకు వెళుతుండగా దొరవారి సత్రం వద్ద కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మొబిన్ బాషాతో పాటు కుటుంబ సభ్యులు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కోటలోని వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు.

13 నుంచి హర్ ఘర్ తిరంగా..

నాయుడుపేట: కేంద్ర ప్రభుత్వం ఈ నెల 13 నుంచి హర్‌ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించనున్నట్లు గూడూరు పోస్టల్ సూపరింటెండెంట్ ఎస్‌ఏ స్‌వీఏకె కుమార్ తెలిపారు. ఈ నెల 13 నుంచి 15 వరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిపై మువ్వెన్నెల జెండాను ఎగరవేయాలని సూచించినట్లు చెప్పారు. ప్రతి పోస్టాఫీసులో జెండాలు అందుబాటులో ఉన్నాయని రూ.25 చెల్లించి జెండాను పొందవచ్చని వివరించారు.

రియాజ్ కుటుంబ సభ్యులకు పరామర్శ

నాయుడుపేటటౌన్: ముస్లిం మైనారిటీ నాయకులు హాజీ గఫూర్ సాహెబ్ కుమారుడు షేక్ రియాజ్(38) మృతి పట్ల శుక్రవారం వైఎస్సార్ సీపీనాయకులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నూర్ మసీదు కార్యక్రమాల్లో రియాజ్ చురుగ్గా వ్యవహరించేవారు. రియాజ్ మృతి పట్ల నూర్ మసీదు, జామీయ, అమీర్ షావలీ, మక్కా మసీదుల మత పెద్దలు ప్రగాఢ సంతాపం తెలిపారు. రియాజ్ అంత్యక్రియలకు భారీగా తరలిరావడం విశేషం.

భోజనం తినలేమంటూ విద్యార్థుల నిరసన


నిరసన తెలియజేస్తున్న విద్యార్థులు

నాయుడుపేట: మున్సిపాలిటీలోని ఎల్‌ఏ సాగరం ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం అధ్వానంగా ఉందంటూ విద్యార్థులు శుక్రవారం నిరసనకు దిగారు. మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు సక్రమంగా వంట చేయడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆకలితో అల్లాడిపోతున్నామని చెప్పారు. 800 మంది విద్యార్థులు పాఠశాల ముందు భోజనం చేయకుండా నిరసన వ్యక్తం చేశారు.

పేదల సంక్షేమమే జగనన్న లక్ష్యం


బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

సూళ్లూరుపేట రూరల్ : పేదల సంక్షేమమే లక్ష్యంగా జగనన్న ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు. శుక్రవారం మండలంలోని దామానెల్లూరు సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. పథకాల లబ్ధిని వివస్తూ సంక్షేమ బావుటా బుక్‌లెట్‌ను అందజేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. సుమారు 400 ఇళ్లను తిరిగి సంక్షేమ ఫలాలను వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 11 రకాల సేవలను అందించినట్లు చెప్పారు. దళారీలకు తావులేకుండా నవరత్నాల పథకాలు లబ్ధిదారులకు నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమజేస్తున్న ఏకైక ప్రభుత్వమని తెలిపారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను సత్వరం పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎంపీపీ అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్ వెలుగు రమణమ్మ, మాజీ సర్పంచ్ లొక్కు రమణయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు జెట్టి వేణు తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు జోన్‌కు త్వరలో 400 బస్సులు

రాపూరు: రాష్ట్రంలో 1500 కొత్త బస్సులను ఆర్టీసీ కొనుగోలు చేయనుందని, వీటిలో నెల్లూరు జోన్‌కు 400 బస్సులు వస్తాయని నెల్లూరు ఆర్టీసీ జోన్ ఈడీ ఆదామ్‌సాహెబ్ తెలిపారు. శుక్రవారం రాపూరు ఆర్టీసీ డిపో, బస్టాండ్, గ్యారేజ్‌లను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ పరిసరాల్లో ఖాళీ స్థలాలను లీజుకు ఇస్తున్నామన్నారు. నెల్లూరుజోన్ (నెల్లూరు, బాపట్ల, ప్రకాశం, పలనాడు, గుంటూరు)పరిధిలో 31 ఖాళీ స్థలాలను 15 సంవత్సరాలు లీజు ఇచ్చినట్లు తెలిపారు. మరో 9 స్థలాలను లీజుకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. రాపూరులో 2 ఎకరాల స్థలం ఉందని, అవసరమైన వ్యాపారవేత్తలు సంప్రదిస్తే లీజు ఇస్తామని పేర్కొన్నారు.

జనతా గ్యారేజీల్లో అనుభవజ్ఞులైన మెకానిక్‌లు

ఆర్టీసీ డిపోల్లో ఏర్పాటు చేసిన జనతా గ్యారేజీల్లో ప్రైవేటు బస్సులు, లారీల మరమ్మతులు చేస్తారని ఈడీ తెలిపారు. అనుభజ్ఞులైన మెకానిక్‌లు ఉన్నారని, నామమాత్రపు ఫీజులు చెల్లిస్తే మరమ్మతులు చేస్తారని పేర్కొన్నారు. గ్యారేజీల ద్వారా గత ఏడాది రూ.30 లక్షలు ఆదాయం వచ్చిందని, ఈ ఏడాది ఇప్పటి వరకు రూ.18 లక్షల వచ్చిందన్నారు. రాపూరు–శ్రీశైలం, పెంచలకోన–శ్రీకాళహస్తి బస్సులు నడిపే విషయమై పరిశీలిస్తామన్నారు.ఈకార్యక్రమాల్లో ఆర్‌ఎం వెంకటశేషయ్య, కార్గో మేనేజర్ ఇబ్రహీం, సీటీఈఎం చిరంజీవి, డిపో మేనేజర్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.


గ్యారేజ్‌ని పరిశీలిస్తున్నఈడీ ఆదామ్‌సాహెబ్

విశ్వోదయ కళాశాలకు ఏ గ్రేడ్

వెంకటగిరి: పట్టణంలోని విశ్వోదయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నాక్ బృందం 3.25 (సీజీపీఏ)తో ఏ గ్రేడ్ కేటాయించిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.అరుణ్‌కుమార్ తెలిపారు. స్థానిక కళాశాలలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో అత్యుత్తమ సీజీపీఏతో ఏ గ్రేడ్ సాధించిన ప్రభుత్వ కళాశాల వెంకటగిరి విశ్వోదయ ప్రభుత్వ కళాశాల మాత్రమేనని తెలిపారు. గ్రేడ్ సాధించినందుకు విద్యా శా ఖ కమిషనర్ పోలా భాస్కర్ కళాశాల సిబ్బందిని అభినందించారని ప్రిన్సిపల్ తెలియజేశారు.

గిరిజనుల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

వెంకటగిరిరూరల్ : గిరిజనులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందే దిశగా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్ తెలిపారు. వెంకటగిరి రూరల్ మండలం సోమసానిగుంట పంచాయతీ ధర్మచాట్లవారికండ్రిగలో రూ.5లక్షలతో నిర్మించిన మినరల్ వాటర్‌ప్లాంట్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గ్రామంలో గత ఉగాది పండగ నాడు పర్యటించామని, ఆ గ్రామంలో ఫ్లోరైడ్ కారణంగా సుమారు 12 మంది వరకు అనారోగ్యానికి గురై మృత్యువాత పడిన ఘటనలు గుర్తించామన్నారు. ఈ మేరకు గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు ఎస్టీ కమిషన్‌కు విన్నవించగా స్పందించిన అధికారులు వెంటనే మంజూరు చేయడం హర్షణీయమన్నారు. ఫ్లోరైడ్ కారణంగా అనారోగ్యానికి గురై గత నెలలో మృతి చెందిన గ్రామానికి చెందిన 7వ తరగతి విద్యార్థిని అరుణ కుటుంబాన్ని ఎస్టీ కమిషన్ ద్వారా ఆదుకునేందుకు డీటీడీఏ దృష్టికి తీసుకెళ్తామని భరోసా ఇచ్చారు.


ఆర్‌ఓ వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న శంకర్‌నాయక్

రూ. 20లక్షలతో ఓవర్‌హెడ్‌ట్యాంక్ మంజూరు

ధర్మచాట్లవారి కండ్రిగ ఎస్టీకాలనీలో ఫ్లోరైడ్ సమస్య పరిష్కార దిశగా ముందస్తుగా పంచాయతీ నిధుల నుంచి రూ.5 లక్షలతో మినరల్ వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేశామని, మరో రూ. 20లక్షలతో తాగునీటి ఓవర్‌హెడ్ మంజూరు చేస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ విజయభాస్కర్ వెల్లడించారు. అనంతరం గర్భిణులకు జగనన్న పోషణ కిట్లను పంపిణీ చేశారు. గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య, తిరుపతిజిల్లా అధ్యక్షుడు తలపల చెంచుమల్లికార్జునరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు తంబిరెడ్డి శివారెడ్డి, ఎంపీపీ భూపతి సుధాకర్, సర్పంచ్ చెంచులక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు వరమ్మ, ఎంపీడీఓ విజయలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఎస్‌బి సత్తార్‌హుసేన్, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

పోలేరమ్మ ఆలయంలో పూజలు



వెంకటగిరి: పట్టణంలోని 7వ వార్డు పరిధిలోని పోలేరమ్మ ఆలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ శుక్రవారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, అందుకు కృషిచేసిన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయసంస్థ చైర్‌పర్సన్ దొంతుశారద, మున్సిపల్ వైస్‌చైర్మన్ శేతురాశి బాలయ్య, పట్టణ కన్వీనర్ ఢిల్లీబాబు, కౌన్సిలర్లు నారాయణ, కల్యాణి, రాధమ్మ, వహీద, శ్రీనివాసులురెడ్డి, నాయకులు చింతపట్ల మురళి తదితరులు పాల్గొన్నారు.

నేదురుమల్లితో భేటీ

వెంకటగిరి: వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని శుక్రవారం ఆయన నివాసంలో ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ మర్యాద పూర్వకంగా కలిశారు. అలాగే తిరుపతిజిల్లా డాక్టర్స్ విన్స్ యూనియన్ అధ్యక్షుడు డాక్టర్ రమేష్ కూడా నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు.

తల్లిపాలలో రోగ నిరోధక శక్తి

గూడూరురూరల్ : తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష అని ఆంధ్ర మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి తెలిపారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో ఏరియా ఆస్పత్రిలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు.

తల్లిపాలు శిశువుకు శ్రీరామరక్ష

పెళ్లకూరు: చిల్లకూరు, దిగువచావలి గ్రామాల్లో శుక్రవారం మహిళ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. సర్పంచ్ పగడాల హరిబాబురెడ్డి, ఎంపీడీవో సురేష్‌బాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సాయిలక్ష్మి పాల్గొన్నారు.

తల్లిపాలపై అవగాహన

సైదాపురం: వేములచేడు అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లిపాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక గర్భిణు లు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు.

పోషణ కిట్లు పంపిణీ

ఓజిలి: కుందాం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. గర్భిణులకు సహకార సంఘం అధ్యక్షులు ఎద్దల రాజారామిరెడ్డి సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. భట్లకనుపూరులో తల్లిపాల ఆవశ్యకతపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజన అవగాహన కల్పించారు.

తల్లిపాల విశిష్టతపై అవగాహన

నాయుడుపేటటౌన్ : పట్టణంలో జైహింద్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రం వద్ద శుక్రవారం తల్లిపాల విశిష్టతపైఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లను గర్భిణులకు, బాలింతలకు పంపిణీ చేశారు.